RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 135 | జూన్ 14 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 135 | JUN 14 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్: దేశం దాటించేందుకు ఏర్పాట్లు 2

## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

### కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క



**హైదరాబాద్ జనసంఘర్షణ**

కేంద్ర ప్రభుత్వం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని భావిస్తున్న 'వీబీజీ రాంజీ' స్కీం పట్ల తీవ్ర నిరసన తెలపాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నూతన పథకాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాయనున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ పథకానికి వ్యతిరేకంగా ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని ఆమె గుర్తుచేశారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన సాంకేతిక, క్షేత్రస్థాయి అంశాలపై శనివారం ప్రజాభవన్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్,

➤ మిగతా 2వ పేజిలో..

# హైదరాబాద్‌లో భారీ వర్షం

### హై అలర్ట్ ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ**

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్‌నగర్, ప్రగతినగర్, మూసాపేట్, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్ తదితర ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. శంషాబాద్ పరిధిలో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి పూర్తిగా జలమయమై చెరువును తలపించింది. రోడ్డుపై భారీగా నీరు చేరడంతో వాహనదారులు, బాటసారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో సాధారణంగా నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ అత్యవసర బృందాలను (డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్స్) మోహరించాలని సీఎం సూచించారు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం చాలా అవసరమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ (జీహెచ్ఎంసీ), హైడ్రా (న్ణ=ూూ), విద్యుత్ శాఖ, వాటర్ బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జూ), డీజీపీ, స్పెషల్ సీఎస్ మరియు నగరానికి చెందిన సీనియర్ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడటంతో పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు మరియు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సింగరేణి సంస్థ గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల ప్రక్రియను మరింత వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు

➤ మిగతా 2వ పేజిలో..

# ఫ్రాన్స్‌లో జీ-7 సదస్సు

### విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన నిమిత్తం శనివారం న్యూఢిల్లీ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన స్లోవేకియా, ఫ్రాన్స్ దేశాలను సందర్శించనున్నారు. ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాల బలోపేతంపై చర్చలు జరపడంతో పాటు, ఫ్రాన్స్‌లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక జీ7 దేశాల సదస్సులో ఆయన పాల్గొంటారు. సుదీర్ఘ విరామం తర్వాత, అంటే 1993 తర్వాత ఒక భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. జూన్ 14, 15 తేదీల్లో ప్రధాని

➤ మిగతా 2వ పేజిలో..

## తదుపరి ఆర్మీచీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

### కేంద్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

భారత తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (ఆర్మీ చీఫ్)గా ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో జూన్ 30 మధ్యాహ్నం నుంచి ధీరజ్ సేథ్ నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ పదవిలో ఆయన 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ , ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్, 1986 డిసెంబర్‌లో భారత సైన్యంలోని ఆర్మర్డ్ కోర్స్ విభాగంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో

➤ మిగతా 2వ పేజిలో..

## అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

### ఐదుగురు సిబ్బంది మృతి



**అస్సాం జనసంఘర్షణ**

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో శనివారం ఒక విషాదకర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల

➤ మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
14 ఆదివారం, జూన్ 2026

# వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

**మొదటిపేజీ తరువాయి..**
కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు మరియు ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ.. ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం కేంద్రం నుండి రావాలంటే ఈ నూతన స్కీంను అమలు చేయక తప్పని పరిస్థితి ఉందని మంత్రికి వివరించారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే అన్ని రాష్ట్రాలు ఈ పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న విషయాన్ని అధికారులు ప్రస్తావించారు. అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో ఈ నూతన పథకంపై అవలంబిస్తున్న విధానాలపై చర్చించామని, అయితే దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.
ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మేటివ్ పద్ధతిలో పని దినాలను కేటాయించే విధానాన్ని కేంద్రం సవరించాలని మంత్రి డిమాండ్ చేశారు. ముఖ్యంగా వ్యవసాయ సీజన్‌లో ఉపాధి హామీ పనులకు 60 రోజుల పాటు బ్రేక్ ఇవ్వాలనే నిబంధనను పూర్తిగా తొలగించాలన్నారు. పంట సీజన్ కాలంలోనే వర్షాలు విస్తారంగా కురుస్తాయని, ఆ సమయంలోనే ఉపాధి హామీ ద్వారా వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని వివరించారు. ఒకవేళ 60 రోజుల పాటు పనులను నిలిపివేస్తే మొక్కలు నాటే ప్రక్రియ ఆగిపోతుందని, ఇది కేంద్రం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన 'గ్రీన్ ఇండియా క్యాంపెయిన్' ఆశయానికే విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పైగా ఆదివాసీ, కొండ ప్రాంతాలలో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని, పనులు మొదలైన తర్వాత ఇంత సుదీర్ఘ విరామం ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుండి ఒక్కసారిగా నూతన విధానంలోకి మారడం రాష్ట్రాలకు కష్టతరమని, అందుకే ఈ చట్టం అమలును కొంతకాలం వాయిదా వేసి వెసులుబాటు కల్పించాలని కోరారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రం ఒత్తిడి వల్ల ఈ స్కీంను అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఎలాంటి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు కూలీలకు జరిగే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలా భర్తీ చేయాలో ఒక ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

## బిర్యానీ తిన్న వైద్య విద్యార్థులకు అస్వస్థ

### ఫుడ్ పాయిజనింగ్ అయినట్లు గుర్తింపు

**గోదావరిఖని, జూన్13 :** నగరంలోని సిమ్స్ వైద్యకళాశాల విద్యార్థులకు శుక్రవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటనలో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖని నగరంలో సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(సిమ్స్) చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగిసాయి. అనంతరం సరదా గా 12 మంది కవిత థియేటర్ సమీపం లో ని ఓ హోటల్ లో విందు భోజనానికి వెళ్లి మండీ బిర్యానీ ఆరగించాచి తిరిగి ఎవరి రూమ్ లకు వారు వెళ్లి పోయారు. ఇందులో 12 మంది విద్యార్థులలో 11 మంది కి ఫుడ్ ఫాయిజన్ అయింది. దీంతో అందరికీ వాంతులు విరోచనాలు మొదలయ్యాయి. దీంతో వారిని గోదావరిఖనికి లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే 8 మందికి తీవ్ర, ముగ్గురికి స్వల్పంగా అస్వస్థత కు లోనయినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం వారిని వైద్యుల సలహా మేరకు డిశ్చార్జ్ చేశారు. అయితే హోటళ్లలో నాణ్యతను పరిశీలంచాల్సిన అధికారులు ఇంత జరిగినా పత్తా లేకపోవటం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.

## భారీ వర్షానికి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు

### రాకపోకలకు తీవ్ర అంతరాయం

**నిజామాబాద్, :** నిజామాబాద్ జిల్లా లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్డుపై చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటన వివరాలను శనివారం రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ వెల్లడించారు. సాయంత్రం నుండి భారీగా ఈదురు గాలులు వీచాయి. దీంతో పాటు వర్షం కూడా పడడంతో నిజామాబాద్ మండల పరిధిలోని ఖానాపూర్ రోడ్డులో రాత్రి సమయంలో ఓ భారీ వృక్షం విరిగిపోయి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆ రోడ్డు వెంబడి రాకపోకలు నిలిచిపోయినట్లు తెలిపారు. అయితే రోడ్డుపై పడిన చెట్టును తొలగించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది విషయం తెలుసుకుని వెంటనే అక్కడికి వెళ్లి రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టును పెట్రోలింగ్ సిబ్బంది రోడ్డుపై నుండి తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకల అంతరాయం తొలగిపోయింది

## గిరిజన సంప్రదాయాలపై పేపర్ ప్రజెంటేషన్

### రీసెర్చ్ స్కాలర్ రాజేంద్రప్రసాద్‌కు సన్మానం

భద్రాద్రికొత్తగూడెం : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్వహించిన 'గిరిజన జీవితం, సాంప్రదాయాలు, గతానుభవాలు, అంతర్‌దృష్టులు, దూరదృష్టి' అంశంపై ఈ 12, 13 తేదీల్లో రెండు రోజుల సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్, సమక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్, ద్రావిడ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుబ్బయ్య చారి హాజరయ్యారు. ఈ సెమినార్‌లో బూర్గంపహాడ్ మండల పరిధిలోని కోయగూడెంకు చెందిన ట్రైబల్ రీసెర్చ్ ఫెలో పాయం రాజేంద్రప్రసాద్ పాల్గొని 'కోయ గిరిజనుల ప్రాచీన ఆహారపు అలవాట్లు' అంశంపై రాసిన వ్యాసాన్ని సమర్పించారు. ఈ సెమినార్‌లో ఆ వ్యాసం పలువురు ప్రముఖుల నుండి అభినందనలు అందుకోగా రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

# సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

**మొదటిపేజీ తరువాయి..** ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫ్రాన్స్‌లో జీ-7 సదస్సు

**మొదటిపేజీ తరువాయి..** మోదీ స్లోవేకియాలో గడపనున్నారు. ఈ సందర్భంగా అక్కడి అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, ప్రధానమంత్రి రాబర్ట్ ఫికోలతో మోదీ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య మైత్రిని పెంపొందించుకుంటూ పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. ఫ్రాన్స్ పర్యటన మరియు జీ7 సదస్సు:
స్లోవేకియా పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ ఫ్రాన్స్ చేరుకుంటారు. జూన్ 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని 'ఈవియన్' నగరంలో జరిగే జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సుకు ఆయన హాజరవుతారు. ఈ సదస్సు వేదికగా పలు ప్రపంచ దేశాల అధినేతలు, అంతర్జాతీయ ప్రతినిధులతో ప్రధాని సమావేశం కానున్నారు. ముఖ్యంగా 'గ్లోబల్ సౌత్' (దక్షిణాది ప్రపంచ దేశాల) ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న సవాళ్లపై ఈ భేటీలో చర్చిస్తామని ప్రధాని మోదీ వెల్లడించారు.
అనంతరం జూన్ 18వ తేదీన ప్యారిస్‌లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'వివాటెక్ 2026' సదస్సులో కూడా ప్రధాని పాల్గొననున్నారు.

## ఆదర్శ రైతు సాయినికి ఉత్తమ రైతు అవార్డు

**భద్రాద్రికొత్తగూడెం, :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదర్శ రైతు సాయిని మధుసూదన్ రావుకు ఉత్తమ రైతు అవార్డు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ విశ్వవిద్యాలయ ఫౌండేషన్ డే సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. సాయిని మధుసూదన్ రావు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే 'రైతులకు నేస్తం' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేయనున్న కొత్త వంగడాలు, చిరుధాన్య పంటల సాగు విధానాలు, నూతన వ్యవసాయ సాంకేతికతలను తన పొలంలో అమలు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని పలువురు రైతులు, వ్యవసాయ అధికారులు పేర్కొంటూ అభినందనలు తెలిపారు.

## పాఠశాలల కుదింపునకు నిరసన

### 15న డైరెక్టరేట్ ఎదుట ధర్నాకు పిడిఎస్‌యు పిలుపు

హనుమకొండ : కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల కుదింపునకు నిరసనగా ఈనెల 15న ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడానికి ముందుఏ మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఉన్న పాఠశాలలను కుదించడం అన్యాయమని అన్నారు. ఉపాధ్యాయుల కొరత, మరుగుదొడ్లు, సరైనా బిల్డింగ్స్?, కనీస సమస్యలను ఏమాత్రం మెరుగుపరుచకుండా 4 వేల పాఠశాలలకు కుదించడం పేద విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టివేయడమే నన్నారు. ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చి కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలను పెంచి పోషించుకుంటుందని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను రేవంత్ సర్కార్ నియంత్రించాలని లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యంలో రైతు జీవితం

### మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్ర ఆవిష్కరణ

**నల్లగొండ, ):** తెలుగు సాహిత్యంలో రైతు జీవితాన్ని మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్రంగా ఆవిష్కరించారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాహిత్య అకాడమీ, సృజన సాహితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మేరెడ్డి యాదగిరి రెడ్డి సాహిత్య సమాలోచన ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఆరు
దశాబ్దాలుగా నిబద్ధతతో అనేక పక్రియలలో మేరెడ్డి యాదగిరిరెడ్డి సాహిత్య సృజన చేశారని కొనియాడారు. ముఖ్యంగా కథా సాహిత్యంలో తెలంగాణ గ్రామీణ ప్లలెను గ్రామీణ జీవితాన్ని రైతుల జీవితాలను చక్కగా చిత్రించారన్నారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ నవలా రచయిత శిరంశెట్టి కాంతారావు మాట్లాడుతూ.. మేరెడ్డి యాదగిరి రెడ్డి అట్టడుగు వర్గాల జీవితాలను సాహిత్య కాన్వాస్ పై ఆవిష్కరించారన్నారు. పాలపిట్ట సంపాదకుడు గుడిపాటి మాట్లాడుతూ తెలుగు కథా సాహిత్యంలో మేరెడ్డి యాదగిరిరెడ్డి తనదైన ముద్రవేశారన్నారు. నాలుగు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య, మేరెడ్డి యాదగిరి రెడ్డి కథలు రైతు జీవితం అనే అంశంపై ప్రసంగించారు. డా.పొట్లబత్తుల రామకృష్ణ మేరెడ్డి యాదగిరి రెడ్డి కవిత్వం అనే అంశంపై ప్రసంగించారు. డా.ఉప్పల పద్మ 'మేరెడ్డి యాదగిరిరెడ్డి బాలసాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ సి.అనిత కుమారి మేరెడ్డి మినీ కవిత్వం వస్తు శిల్పాలు అనే అంశంపై ప్రసంగించారు.

# అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

**మొదటిపేజీ తరువాయి..** ల్యాండ్ అవుతున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు ఐఏఎఫ్ అధికారులు ధృవీకరించారు. కాగా, ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌ను రక్షించి, ప్రస్తుతం ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం జరగడానికి గల ఖచ్చితమైన కారణాలను అన్వేషించేందుకు వైమానిక దళం అత్యున్నత స్థాయి దర్యాప్తునకు (కోర్ట్ ఆఫ్ ఇంక్వైరీ) ఆదేశించింది. ప్రమాదానికి గురైన ఏఎన్-32 విమానం రెండు ఇంజన్లు కలిగిన అత్యంత దృఢమైన టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. ఎలాంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని, ఎత్తైన ప్రదేశాలలో మరియు వేడి ఉష్ణమండల వాతావరణంలోనూ సమర్థంగా పనిచేసేలా దీనిని రూపొందించారు. సుమారు 7.5 టన్నుల బరువైన సరుకును, లేదా 50 మంది ప్రయాణికులను, లేదంటే 42 మంది పారాట్రూపర్‌లను ఒకేసారి రవాణా చేయగల సామర్థ్యం దీనికి ఉంది. దేశంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మారుమూల ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి సహాయక సామగ్రిని చేరవేయడానికి, ఎయిర్ డ్రాప్ చేయడానికి భారత వైమానిక దళం ఈ విమానాలను విస్తృతంగా ఉపయోగిస్తూ ఉంటుంది. అలాంటి నమ్మకమైన విమానం ల్యాండింగ్ సమయంలో ప్రమాదానికి గురికావడం వాయుసేనలో తీవ్ర విషాదాన్ని నింపింది.

# తదుపరి ఆర్మీచీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

**మొదటిపేజీ తరువాయి..** ఆయన విశిష్ట సేవలు అందించారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఎడారి ప్రాంతంలో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు, పశ్చిమ థియేటర్‌లో ఆర్మర్డ్ బ్రిగేడ్‌కు మరియు జమ్మూ కశ్మీర్‌లో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఫోర్స్‌కు విజయవంతంగా నాయకత్వం వహించారు. భారత సైన్యంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సుదర్శన్ చక్ర కోర్స్‌కు కమాండర్‌గా, ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన, సౌత్ వెస్ట్రన్ కమాండ్ మరియు సదరన్ కమాండ్ (దక్షిణ కమాండ్) రెండింటికీ సారథ్యం వహించిన అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. సైన్యంలో ఆయన చూపిన అసమాన ప్రతిభకు, దేశ రక్షణలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను పరమ్ విశిష్ట సేవా మెడల్ (పీవీఎస్ఎం), ఉత్తమ్ యుద్ధ్ సేవా మెడల్ (యూవైఎస్ఎం), మరియు అతి విశిష్ట సేవా మెడల్ (ఏవీఎస్ఎం) లతో సత్కరించింది. సైన్య ఆధునీకీకరణ, వ్యూహాత్మక ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన ధీరజ్ సేథ్ నాయకత్వంలో భారత సైన్యం మరిన్ని మైలురాళ్లను అందుకుంటుందని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

## 26న యాంటీ డ్రగ్ 3కే రన్

### కరపత్రాన్ని ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే


**జగిత్యాల, :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26 న నిర్వహించనున్న 'యాంటీ డ్రగ్ 3కే రన్' కరపత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ జగిత్యాల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రన్ స్ట్రాంగ్ లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో నిర్వహించనున్న ఈ 3కే రన్ పాత బస్టాండ్ దగ్గర లోని శ్రీ వివేకానంద మినీ స్టేడియం నుండి ఐఎంఏ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు..డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని వారు పిలుపునిచ్చింది. ఈ యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ బండెల విజయ్ , డాక్టర్ ఇనుగురతి రాజశేఖర్ పాల్గొన్నారు.

# బినామీ ఫెర్టిలైజర్ షాపులపై ఉక్కుపాదం మోపాలి

- సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్

పాల్వంచ జూన్ 13 (జన సంఘర్షణ)

ఏజెన్సీ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బినామీ ఫెర్టిలైజర్ వ్యాపారాలను అరికట్టాలని, అమాయక రైతులను దోచుకుంటున్న నకిలీ విత్తన మాఫియాపై ఉక్కుపాదం మోపాలని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. పాల్వంచ మండల అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సేవాలాల్ సేన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ శాఖ, టాస్క్ ఫోర్స్ అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలు కేవలం నామమాత్రంగానే సాగుతున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతరులు స్థానిక గిరిజనుల పేర్లతో బినామీ లైసెన్సులు పొంది అక్రమంగా ఫెర్టిలైజర్ షాపులు నిర్వహిస్తున్నారని సురేష్ నాయక్ పేర్కొన్నారు. అసలు యజమానులు ఇతర రాష్ట్రాలు లేదా విదేశాల్లో ఉంటూ ఇక్కడ వ్యాపారాలు నడిపిస్తున్నారని తెలిపారు. మందులు, ఎరువులు, విత్తనాలపై కనీస అవగాహన లేని వ్యక్తులను తక్కువ జీతాలకు నియమించి దుకాణాలు నడుపుతున్నారని, దీనివల్ల వారు రైతులకు తప్పుడు సలహాలు ఇస్తూ రైతాంగాన్ని తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక గిరిజన రైతుల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని, ఖాతాల పేరుతో కొందరు వ్యాపారులు లక్షల రూపాయలు వసూలు చేస్తూ దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా, ప్రతిరోజూ మండలాల వారీగా ఆకస్మిక దాడులు నిర్వహించాలని కోరారు. దుకాణాల్లో లైసెన్స్ కలిగిన అసలు యజమాని ఉన్నాడా లేదా, అలాగే అక్కడి సిబ్బందికి వ్యవసాయ ఇన్‌పుట్లపై సరైన అవగాహన ఉందా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను డిమాండ్ చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ నకిలీ



విత్తనాలు విక్రయిస్తూ రైతుల జీవితాలతో ఆడుకునే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపుల లాలు నాయక్, నరేష్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత ఎమ్మెల్యే కుంజా బొజ్జికి తగిన గుర్తింపు ఇవ్వాలి

- కుంజా సంతోష్
- బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్ డిమాండ్
- కుంజా బొజ్జి సేవలు చిరస్మరణీయం.. తగిన గుర్తింపు ఇవ్వాలి
- కొత్త మార్కెట్‌కు దివంగత కుంజా బొజ్జి పేరు పెట్టాలి: కుంజా సంతోష్ డిమాండ్
- రాజకీయాలకు అతీతంగా దివంగత కుంజా బొజ్జిని గుర్తించాలి

భద్రాచలం జూన్ 13 (జన సంఘర్షణ)

భద్రాచలం నియోజకవర్గానికి మూడు సార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజా సేవలో విశేష కృషి చేసిన నిస్వార్థ ఆదివాసీ ప్రజా నాయకుడు కీ.శే. కుంజా బొజ్జికి ప్రభుత్వం, సమాజం తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం నిరంతరం శ్రమించిన ఇటువంటి గొప్ప నాయకులను గౌరవించడం మన అందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.



**మూడు సార్లు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం:**

కుంజా బొజ్జి 1985, 1989, 1994 సంవత్సరాల్లో భద్రాచలం నియోజకవర్గ ప్రజల అపారమైన ఆశీస్సులతో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని కుంజా సంతోష్ గుర్తుచేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు.

**భద్రాచలం అభివృద్ధిలో కీలక పాత్ర:**

భద్రాచలం పట్టణంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర వికాసానికి కుంజా బొజ్జి గారు ఎనలేని కృషి చేశారని సంతోష్ వివరించారు. ముఖ్యంగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి, ఏజెన్సీ ప్రజల కోసం ఐటిడిఏ కార్యాలయాన్ని భద్రాచలానికి తీసుకురావడంలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైనదని ప్రశంసించారు.

**చిరస్మరణీయమైన ప్రజా సేవలు:**

పట్టణ రక్షణ కోసం నిర్మించిన కరకట్ట, నిరుపేదల కోసం పలు కాలనీల ఏర్పాటు, విద్యా వికాసం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి, గిరిజన విద్యార్థుల కొరకు గురుకుల పాఠశాల ఏర్పాటు, నెహ్రూ మార్కెట్ నిర్మాణం వంటి అనేక శాశ్వత అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పడిన శ్రమ చిరస్మరణీయంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

**అవినీతి లేని నిజాయితీ పరుడు:**

ఎలాంటి అవినీతి ఆరోపణలు లేని అత్యంత నిజాయితీ పరుడైన ప్రజానాయకుడిగా కుంజా బొజ్జి నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని సంతోష్ అన్నారు. ఆయనను కేవలం ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ నాయకుడిగా మాత్రమే



చూడకుండా, ఆదివాసీ సమాజం నుంచి ఎదిగి భద్రాచలం ప్రాంత ప్రగతికి బాటలు వేసిన మహానాయకుడిగా గుర్తించాలని కోరారు.

**కొత్త మార్కెట్‌కు కుంజా బొజ్జి పేరు పెట్టాలి:**

భద్రాచలం ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక చేసిన తీర్మానాన్ని తాము పూర్తిగా సమర్థిస్తున్నామని కుంజా సంతోష్ తెలిపారు. భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మించిన మార్కెట్‌కు కీ.శే. కుంజా బొజ్జి పేరును నామకరణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి:**

ఈ నామకరణ ప్రతిపాదనను సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూల దృక్పథంతో పరిశీలించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కుంజా సంతోష్ ఈ సందర్భంగా గట్టిగా విజ్ఞప్తి చేశారు.

# యువతకు ఆదర్శంగా నిలుస్తున్న రక్తదాత షేక్ సలీం

- 18 సార్లు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న ఇల్లందు యువకుడు

ఇల్లందు జూన్ 13 (జన సంఘర్షణ)

నిరుపేదలు, ఆపదలో ఉన్న బాధితులను ఆదుకుంటూ ఇల్లందుకు చెందిన యువకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు షేక్ సలీం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సమాజంలో రక్తం దొరకక ఎందరో ప్రాణాలు కోల్పోతున్న తరుణంలో, తాను ఉన్నానంటూ ముందుకు వస్తూ ఇప్పటివరకు 18 సార్లు రక్తదానం చేసి పలువురి ప్రాణాలను కాపాడాడు. 'ఏబీ పాజిటివ్' రక్త సమూహానికి చెందిన సలీం, అత్యవసర సమయాల్లో పిలుపు రాగానే స్పందిస్తూ




మానవత్వాన్ని చాటుకుంటున్నాడు. ముఖ్యంగా కాన్పుల సమయంలో తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణీ స్త్రీలకు, నిరంతరం రక్తం మార్చాల్సిన తలసేమియా వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు సలీం ఆపద్బాంధవుడిగా మారాడు. వీటితో పాటు ఊహించని రోడ్డు ప్రమాదాలకు గురైన




క్షతగాత్రులకు, అత్యవసర ఆపరేషన్లు జరిగే రోగులకు సకాలంలో రక్తదానం చేస్తూ ఎందరో కుటుంబాల్లో వెలుగులు నింపాడు. రక్తదానంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పిస్తూ వారిని కూడా ఈ సత్కార్యం వైపు ప్రోత్సహిస్తున్నాడు. రక్తదానమే కాకుండా గత 9 సంవత్సరాలుగా ఇల్లందు పట్టణంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో సలీం చురుగ్గా పాల్గొంటున్నాడు. కరోనా కష్టకాలంలో లాక్‌డౌన్ వల్ల ఉపాధి కోల్పోయిన పేదలకు, దిక్కుతోచని స్థితిలో ఉన్న వృద్ధులకు, యాచకులకు నిత్యావసర వస్తువులు, ఆహార పొట్లాలు పంపిణీ చేసి వారి ఆకలి తీర్చాడు. విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రాణాలకు తెగించి ఆయన చేసిన సేవలు స్థానికంగా ఎందరినో ఆకట్టుకున్నాయి. తన నిరంతర సామాజిక సేవలకు గుర్తింపుగా షేక్ సలీం రాష్ట్రస్థాయిలో పలు ప్రతిష్టాత్మక అవార్డులను, ప్రశంసా పత్రాలను అందుకున్నాడు. ఎందరో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రముఖుల చేతుల మీదుగా సన్మానాలు పొంది ఇల్లందు ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చాడు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సలీం సేవా గుణాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన 'బెస్ట్ ఫ్రెండ్స్ మిత్రబృందం'

భద్రాచలం జూన్ 13 (జన సంఘర్షణ)




భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌ని భద్రాచలంలోని ఎస్‌డీపీఓ కార్యాలయంలో శనివారం 'బెస్ట్ ఫ్రెండ్స్ మిత్రబృందం' సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీకి వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో భద్రాచలం పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన అవసరమైన చర్యల గురించి డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఎస్పీ స్పందిస్తూ.. ప్రజలకు నిరంతరం మెరుగైన సేవలు అందించడంతో పాటు, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను మిత్రబృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం పట్టణ 14వ వార్డు సభ్యుడు ఇలమల అశోక్ కుమార్, పద్మశాంతి ఇండస్ట్రీస్ ప్రొప్రైటర్ కోపనాతి శాంతారావు, ఎక్సైడ్ బ్యాటరీస్ మల్లాడి చక్రవర్తి, పాంచజన్య సూపర్ మార్కెట్ ఊస శ్రీనివాస్, పవర్ జోన్ బ్యాటరీస్ చల్లంగి దత్తాత్రేయ, చారి గ్రాఫిక్స్ రవి, ఆఖిశెట్టి రాము, జె. కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుంజా బొజ్జి ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం, జూన్ 13(జనసంఘర్షణ):



భద్రాచలం పట్టణంలోని ఉన్న కొత్త మార్కెట్‌కు భద్రాచలం మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు కుంజా బొజ్జి పేరు పెట్టాలని తీర్మానం చేసి భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావుకి అందజేసిన భద్రాచలం ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కొత్త మార్కెట్‌ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా తయారు చేస్తున్న సందర్భంగా మార్కెట్‌కు కుంజా బొజ్జి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా పేరు పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుని కలిసి వినతిపత్రం అందజేశారు.

# గుండాల మండల పీవైఎల్ 6వ మహాసభ విజయవంతం

- యువత హక్కులకై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు






గుండాల జూన్ 13 (జన సంఘర్షణ)

ప్రగతిశీల యువజన సంఘం గుండాల మండల 6వ మహాసభ శనివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది. స్థానిక పీవైఎల్ గుండాల మండల అధ్యక్షులు తాటి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు మండల పరిధిలోని యువకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగం, మరియు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సభలో ప్రధానంగా చర్చించారు. ఈ మహాసభలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్తి సత్యం, పార్టీ మండల కార్యదర్శి గుండాల సర్పంచ్ కొమరం సీతారాములు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. నేటి సమాజంలో యువత కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా, తమ హక్కుల రక్షణ కోసం మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సాగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, జిల్లా కార్యదర్శి పర్శిక రవి, జిల్లా నాయకులు వి. మూతిలాల్ మాట్లాడుతూ.. యువతను నిర్వీర్యం చేస్తున్న పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. యువతలో చైతన్యాన్ని నింపి, వారిని ప్రగతిశీల మార్గం వైపు నడిపించడంలో పీవైఎల్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. అలాగే ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు గడ్డం లాలయ్య, మండల నాయకులు అరెం నరేష్, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు వై. వెంకన్న, పీవైఎల్ మండల కార్యదర్శి కల్తీ ప్రమోద్ కూడా ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ మహాసభ ద్వారా గుండాల మండల పరిధిలో యువత ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై తీర్మానాలు ఆమోదించారు. మండలంలో క్రీడా మైదానాల ఏర్పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, విద్యా రంగంలో మౌలిక వసతుల కల్పన కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విజయవంతమైన కార్యక్రమంలో పీవైఎల్ మండల నాయకులు మోకాళ్ళ పోతయ్య, మానాల ఉపేందర్, అరేం రామారావు, ముక్తి జనార్ధన్, కుంజ వెంకటేశు, ఇసం సుధాకర్, ఇసం రమేష్, కల్తి ప్రభాకర్, కల్తీ రాంబాబు, కల్తీ పగడయ్య, అజ్మీర శరత్ తదితర ముఖ్య నాయకులతో పాటు గుండాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రగతిశీల యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జన సంఘర్షణ
ఆదివారం 14 జూన్ 2026

# మామిడి గుండాల పేద గిరిజనుల భూములను దొరలు ఆక్రమించడం చట్టవిరుద్ధం

- సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత ఆవునూరి మధు




ఇల్లందు జూన్ 13 (జన సంఘర్షణ)
ఇల్లందు మండలం మామిడి గుండాల ప్రాంతంలోని పేద గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను దొరలు, భూస్వాములు ఆక్రమించడం తీవ్ర చట్ట విరుద్ధమని, బాధితులకు అందరం అండగా నిలబడాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. మామిడి గుండాలలో ఆదివాసి, గిరిజన, పేద రైతులతో అఖిలపక్షం నాయకులు ఎట్టి వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో రాఘవేందర్ రావు అనే భూస్వామి అధికార బలాన్ని అడ్డం పెట్టుకొని, మామిడి గుండాల ప్రాంతంలోని అడవులను సుమారు 3700 ఎకరాలు పట్టా చేయించుకున్నారని ఆవునూరి మధు తెలిపారు. అయితే, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఇక్కడి అడవిని పేద ఆదివాసీ, గిరిజనులు నరుక్కుని సాగుకు యోగ్యంగా మార్చుకున్నారని, గత 50 సంవత్సరాలుగా ఆ భూములపైనే ఆధారపడి సేద్యం చేస్తూ జీవిస్తున్నారని గుర్తుచేశారు. న్యూడెమోక్రసీ సాగించిన సుదీర్ఘ భూపోరాటాల ఫలితంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించిందని ఆయన పేర్కొన్నారు. మొత్తం భూమిలో 2800 ఎకరాల భూమిని ల్యాండ్ సీలింగ్ కింద స్వాధీనం చేసుకుని, కుటుంబానికి 5 ఎకరాల చొప్పున పేదలకు పంచుతామని ప్రకటించిందని తెలిపారు. అయితే ఆనాటి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నేటికీ ఆ భూములకు సంబంధించి క్షేత్రస్థాయిలో సరైన హద్దులు చూపించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకుని నాటి భూస్వాముల వారసులైన నెమరగొమ్ముల శీను బాబు, ఉమామహేశ్వరరావు, శ్యాంసుందర్రావు లు తిరిగి పేదల భూములను ఆక్రమించుకోవడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గత మూడు రోజుల నుండి ఆధునిక యంత్రాలతో (జేసీబీలతో) భూముల్లోకి చొరబడి దౌర్జన్యంగా ఆక్రమించాలని చూస్తున్నారని మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూములను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్న అమాయక ఆదివాసీలను ప్రభుత్వ అధికారులతో బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు దశాబ్దాలుగా సేద్యం చేసుకుంటున్న సాగు భూముల్లో ప్రభుత్వ అధికారులు జేసీబీలతో ట్రంచులు కొడుతున్నారని, భూస్వాముల ప్రయోజనాల కోసం అధికారులు ఇలా వ్యవహరించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. అక్కడున్న పేద ఆదివాసి గిరిజనులు అమాయకులని, ఏమీ చేయలేరనే అహంకారంతోనే దొరలు దౌర్జన్యాలకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాముల, ప్రభుత్వ అధికారుల ఈ అప్రజాస్వామిక వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ భూముల రక్షణ కోసం రాజకీయ జెండాలకు అతీతంగా, ఐక్యంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు, కుల సంఘాలకు, హక్కుల సంఘాలకు, మేధావులకు విజ్ఞప్తి చేశారు. మామిడి గుండాలలో సీలింగ్ కింద కేటాయించిన పేదల భూములకు ప్రభుత్వం తక్షణమే రక్షణ కల్పించాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న భూస్వాములపై నాన్బెయిల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఈ భూములను నమ్ముకుని జీవిస్తున్న రైతులకు తక్షణమే హక్కు పత్రాలు (పట్టాలు) మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని గట్టిగా కోరారు. మామిడి గుండాల ప్రాంతంలోని ఆదివాసి గిరిజన ప్రజలకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని, పేదల సీలింగు భూములను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, చల్లసముద్రం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి నరాటి వెంకటేశ్వర్లు, మండల నాయకులు బొగ్గారపు వెంకన్న, కల్తీ సీతారాములు, చింత భాస్కర్ పాల్గొన్నారు. అలాగే తుడుం దెబ్బ నాయకులు ఈసం కృష్ణ, మంగయ్య, మాజీ సర్పంచ్ తిరుపతి, మామిడి గుండాల ప్రాంత నాయకులు జంపయ్య, ఈసం భద్రన్న, హుస్సేన్, రాందాస్, బాలాజీ, ధర్మ, సువర్ణపాక రాంబాబు, ముక్తి రాజ్ కుమార్, పద్మ, మాధవి, రాజేష్, మోహన్ రావు, సురేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లందు మండల కార్యాలయానికి 'రెండు కళ్లు'..

- ముత్తయ్య, కామేశ్వరరావుల పదోన్నతిపై ఇటు సంతోషం.. అటు వీడ్కోలు వేదన
- సమర్థతకు, నిజాయితీకి దక్కిన పట్టం.. డిప్యూటీ తహసీల్దార్లుగా ప్రమోషన్ పొందిన ఇల్లందు ఆర్ఐలు
- అధికారులుగా కాదు.. జన హృదయ విజేతలుగా! ఇల్లందు ఆర్ఐలు ముత్తయ్య, కామేశ్వరరావులకు డీటీలుగా ప్రమోషన్

ఇల్లందు జూన్ 13 (జన సంఘర్షణ)
ఇల్లందు రెవెన్యూ పరిధిలో తమదైన సేవా ముద్ర వేసి, నిరంతరం ప్రజాసేవకే అంకితమైన ఇద్దరు సమర్థవంతమైన అధికారులు ఉన్నత పదోన్నతులు సాధించారు. ఇల్లందు మండలంలో సుదీర్ఘ కాలంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (ఆర్ఐ) గా సేవలందించిన ముత్తయ్య (ఆర్ఐ-1), కామేశ్వరరావు (ఆర్ఐ-2) లు డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) లుగా పదోన్నతి పొందారు. వారి కృషి, నిజాయితీ, అంకితభావానికి దక్కిన ఈ ఉన్నత గుర్తింపు పట్ల ఇల్లందు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు, పేద రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఇల్లందు కార్యాలయానికి 'రెండు కళ్లు' లాంటి అధికారులు:**

కార్యాలయంలో అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తించే ముత్తయ్య, కామేశ్వరరావులు ఒకేసారి డిప్యూటీ తహసీల్దార్లుగా ప్రమోషన్ పొందడం సహోద్యోగులకు ఎంతో గర్వకారణంగా మారింది. ఈ శుభవార్త కార్యాలయ సిబ్బందిని ఒకవైపు సంతోషంలో ముంచెత్తుతున్నా, మరోవైపు వారు ఇల్లందును విడిచి వెళ్తున్నారనే విషయం సహోద్యోగుల మనసులను తీవ్రంగా కలచివేస్తోంది. తమతో ప్రతిరోజూ కలిసి పనిచేస్తూ, వెన్నుతట్టి నడిపించిన ఇద్దరు పెద్ద దిక్కులు ఒకేసారి బదిలీపై వెళ్తుండటాన్ని సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ప్రమోషన్ పట్ల సంతోషపడాలో, లేక ఇకపై ప్రతిరోజూ వారితో కలిసి పనిచేసే అవకాశం ఉండదనే బాధపడాలో అర్థం కావడం లేదని తోటి సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

**అధికారులుగా కాదు.. పేదల పెన్నిధిగా ఇల్లందులో గుర్తింపు:**

ఇల్లందు మండలంలో ముత్తయ్య, కామేశ్వరరావు ల సేవా శైలి సాధారణ అధికారుల కంటే భిన్నమైనది. కార్యాలయానికి వచ్చే ఏ ఒక్క నిరుపేద, ఆదివాసి గిరిజన రైతు కూడా పనుల కోసం రోజుల తరబడి వేచి



చూడకూడదనేది వీరి ముఖ్య ఉద్దేశం. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు నడవడం ఆలస్యమవుతుందనే విమర్శలు వినిపిస్తుంటాయి. కానీ, ఈ ఇద్దరు అధికారులు ఎక్కడా పేదవాళ్ల పనులలో ఆలస్యం కాకుండా, ఒక సాధారణ ఆఫీసర్‌లా కాకుండా, బాధితుల ఇబ్బందులను తమ సొంత సమస్యలుగా భావించి సకాలంలో పనులు పూర్తి చేసి పెట్టేవారు. ఈ నిరంతర తపనే వారిని ఇల్లందు ప్రజల గుండెల్లో నిలిపి, ఇద్దరికీ సమాజంలో ఎనలేని మంచి పేరును తెచ్చిపెట్టింది.

# వాలీబాల్,టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 13, (జన సంఘర్షణ):




కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం రోజు కెపిహెచ్బిలోని అల్లూరి సీతారామరాజు స్పోర్ట్స్ గ్రౌండ్లో క్షత్రియ క్రీడోత్సవం కమిటీ వారు డి.వి.ఎస్ వర్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాలీబాల్, టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. క్షత్రియ క్రీడోత్సవం కమిటీ వారిని అభినందిస్తూ, క్రీడల పట్ల యువతకు ప్రోత్సాహం అందిస్తూ ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని, అలాగే తల్లితండ్రులు కూడా పిల్లలకు చదువుతోపాటు ప్రతిరోజు ఒక గంట సమయం వారికున్న అభిరుచినిబట్టి ఆ క్రీడలలో పాల్గొనే విధంగా చూడాలని, దీంతో పాటు వారి మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా ఎంతో మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా ఏదో ఒక వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శ్యామల రాజు, మైనర్ రాజు, డిఎస్ రాజు, భీమరాజు వెంకటేశ్వరరాజు, ఎస్. ఆర్ .స్పోర్ట్స్ సభ్యులు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిలువ నీడ లేనివారికి ఆర్థిక సహాయం

- మీకోసం మేమున్నాం టీమ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 13(జనసంఘర్షణ):






చర్ల మండలం ఆర్ కొత్తగూడెం, ఎస్సి కాలనీ నివాసితులైన కూరపాటి వెంకటేశ్వరరావు, శ్రీదేవి లకు చెందిన రేకుల షెడ్డు ఇల్లు ఇటీవలి గాలిదుమారాలకు కూలిపోవడం జరిగింది. వీరు రోజువారీ కూలీ చేస్తే గానీ పూట గడవని పరిస్థితి,అటు ఎండలకు,ఇటు వర్షాలకు నిలువ నీడ లేక, బాగు చేయించుకొనే స్థోమత లేని పరిస్థితుల్లో ఆర్థిక సహాయం కోసం మీకోసం మేమున్నాం టీం ను ఆశ్రయించడంతో వాట్సాప్ గ్రూపుల ద్వారా ఫండ్ రైజింగ్ పోస్టు పెట్టి సేకరించిన 9,500 రూపాయల అమౌంట్‌ను చర్ల లోని మేమున్నాం కార్యాలయంలో సంస్థ సభ్యులు వార్కి అందించడం జరుగింది. ఈ సందర్భంగా చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ.. అనుకోని ప్రకృతి విపత్తుల వలన ఈ కుటుంబం రోడ్డున పడ్డ పరిస్థితి చూసి చాలా బాధ పడడం జరిగిందని, పేదవారు కష్టాల్లో ఉన్నప్పుడు మనమంతా తలా ఓ చేయి వేసి సహాయమందిస్తే, వార్కి ఎంతో మేలు చేసిన వారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీవీ ప్రతాప్, దొడ్డి సూరిబాబు, సొల్లంగి నాగేశ్వరరావు, కవ్వాల రాము, మామిడి సాయి, రామ్మోహన్ రావు, మెంతుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూ హెచ్ నూతన రిజిస్టర్‌గా డాక్టర్ ఏ.జయలక్ష్మి నియామకం

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 13, (జన సంఘర్షణ):



కూకట్పల్లిలోని జేఎన్టీయూ హెచ్ నూతన రిజిస్టర్‌గా డాక్టర్ ఏ.జయలక్ష్మి నియమితులయ్యారు. యూసీఈఎస్‌టీహెచ్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా. ఎ. జయ లక్ష్మి, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌కు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. గత 54 సంవత్సరాల జెఎన్టియు హెచ్ చరిత్రలో మొట్టమొదటిసారిగా మహిళ రిజిస్టర్ గా డాక్టర్ ఏ జయలక్ష్మి నియామకం కావడం విశేషం. గతంలో ఇదే జేఎన్టీయూ క్యాంపస్లో ఆమె ప్రిన్సిపాల్‌గా తధనంతరం డైరెక్టర్ గా పనిచేసి విధులను సమర్థవంతంగా నిర్వహించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. కాగా యూసీఈఎస్‌టీహెచ్‌లోని సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ యొక్క నానో టెక్నాలజీ ప్రొఫెసర్ డా. కె. వెంకటేశ్వర రావు నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెఎన్టియు విద్యాపక బృందం, విద్యా ప్రముఖులు పలువురు డాక్టర్ జయలక్ష్మికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# సామాజిక భాగస్వామ్యంతో కూకట్‌పల్లి జోన్‌లో పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలన

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 13, (జన సంఘర్షణ):



సైబరాబాద్ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి జోన్ పరిధిలో గుర్తించిన పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు (జీవీపీ యస్) ప్రజల భాగస్వామ్యం, సమన్వయం, పారిశుద్ధ్య సిబ్బంది కృషితో విజయ వంతంగా నిర్మూలించబడ్డాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజల సహకారంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది, రామ్‌కీ సంస్థ సిబ్బంది చురుకుగా పాల్గొని పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను లక్ష్యంగా తీసుకొని శుభ్రపరిచారు. అనంతరం ఆ ప్రదేశాలను పూలతో, రంగవల్లులతో అలంకరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రతను కాపాడేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూకట్పల్లి - డీసీ - ఆంజనేయులు మాట్లాడుతూ.. పరిశుభ్రమైన పరిసరాల కోసం పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా, పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. సమాజం, పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక సంస్థల సమిష్టి కృషితో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

# గచ్చిబౌలి, ఇందిరా నగర్‌లో నెలకొన్న డ్రైనేజ్, నాలా సమస్యపై పర్యటన

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 13, (జన సంఘర్షణ):




ఏళ్లు గడుస్తున్న సమస్య మారటం లేదని ,పరిష్కార మార్గం చూపట్లేదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం లింగంపల్లి డివిజన్, గచ్చిబౌలి గ్రామం, ఇందిరా నగర్‌లో గత ఎన్నో సంవత్సరాలుగా నాలా, డ్రైనేజ్ సమస్య వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా అంజయ్య నగర్ నుండి వచ్చే నాలాను రాడిసన్ హోటల్ వద్ద కలుపగా సమస్య తీవ్రమై మొన్న పడిన వానకు గచ్చిబౌలి గ్రామం అంతా మురుగు నీటిమయమవుతుందని స్థానిక ప్రజలు తెలియజేయగా వెళ్లి పర్యటించి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరా నగర్‌లో నాలా, డ్రైనేజీ సమస్య గతంలో ఎన్నో సంవత్సరాలుగా ఉందని, అనేక సార్లు పర్యటించి జీహెచ్ఎంసీ కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, అంజయ్య నగర్ నాలా పి.జె.ఆర్ నగర్ వైపు వెళ్ళదని, కానీ అధికారులు రాడిసన్ హోటల్ వద్ద గచ్చిబౌలి గ్రామం మీదుగా వెళ్ళే నాలాలో కలపడం జరిగిందని, గతంలోనే సమస్య ఉన్న నాలాలో కలిపితే ఉన్న సమస్య తగ్గకపోగా పెద్దదిగా మారుతుందని ఆలోచన లేకుండా పనులు చేస్తున్నారని, ఏళ్లు గడుస్తున్న సమస్య మారలేదని, శాశ్వత పరిష్కార మార్గం చూపకపోగా, కొత్త సమస్యను తెచ్చిపెట్టినట్లుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు తీరుకు ఇదే నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతంలో హాస్టల్స్ పెరిగాయి, ఇల్లు పెరిగాయి, నాలా ను పెద్దదిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తక్షణమే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు చేయిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి కంటెస్టేడ్ కార్పొరేటర్ ఎల్లేష్, నాయకులు ఓబుల్ రెడ్డి, మఖన్ సింగ్, నరసింహ, మహేందర్ యాదవ్, శశాంక్, రోహిత్, జై హింద్, మధు, రాఘవ చారి, రఘునాథ్, సుబ్రమణ్యం, దినేష్, రాము, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విమానంలో కుమార్తెతో కలిసి క్రికెట్ దిగ్గజం సచిన్




తెలంగాణ హైదరాబాద్/జూన్ 13/(జన సంఘర్షణ)

సెలబ్రిటీలు ఏది చేసినా అది ఒక వింత. ప్రపంచ క్రికెట్ దిగజం సచిన్, తన కూతురితో కలిసి విమానంలో కొద్దిసేపు క్రికెట్ ఆడి అందరినీ ఆశ్చర్యపరిచారు. క్రికెట్ ఎలా ఆడాలి, ఎలా బాల్ క్యాచ్ చేసుకోవాలి అన్నదానిపై తన కూతురికి వివరిస్తూ క్రికెట్ ఆడారు విమానంలో. సచిన్, తన కూతురుతో విమానంలో క్రికెట్ ఆడిన వీడియో వైరల్ అవుతుంది.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

రుద్రూర్/జూన్ 13/(జన సంఘర్షణ)



చేపలు పట్టడానికి వెళ్లిన సట్టి సాయిలు(50) చెరువులో మునిగి మృతి చెందాడు. బొప్పాపూర్ గ్రామానికి చెందిన సాయిలు శనివారం ఉదయం చేపలు పట్టేందుకు రుద్రూర్ చెరువుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు జాలర్ల సహాయంతో చెరువులో వెతుకుతుండగా వల చుట్టుకొని ఉన్న సాయిలు మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

## అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించిన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 13, (జన సంఘర్షణ):

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూర్ డివిజన్‌లో శనివారం పర్యటించారు. ఇందులో ప్రధానంగా యూసఫ్ నగర్ హిందూ స్మశాన వాటికను పరిశీలించి అక్కడ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి కమిటీ వేసుకుని ప్రజలుకు ఈ గ్రేవీ యార్డ్ ను అందుబాటులోకి తేవాలని తెలిపారు. అనంతరం రాజీవ్ గాంధీ నగర్ బి బ్లాక్.. సెంట్రల్ అల్లాపూర్ ,లక్ష్మీ నగర్ ప్రాంతాల్లో నీటి సమస్య మరియు పొల్యూషన్ వాటర్ వస్తుందని తెలుసుకొని ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచన చేశారు. అనంతరం పర్వత్ నగర్‌లో సేవరేజ్ పైప్ లైన్ శేర్లింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఇక్కడ కలవడం వల్ల సమస్య ఎదురవుతుందని దీన్ని కూడా పరిష్కరించాలని సూచించారు. అనంతరం గాయత్రి నగర్ వార్డ్ ఆఫీసులో అసోసియేషన్ సభ్యులు వారితో నిర్వహించిన సమావేశంలో పాల్గొని వారు తెలిపిన సమస్యలు తీసుకుని అధికారులకు అక్కడికక్కడే సమస్యను పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా పలు కాలనీలో నీటి సమస్య, రోడ్లు డ్రైనేజ్ సమస్యలను ప్రస్తావించడం జరిగింది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయిందని, ఇంతకాలం వేచి చూసామని కానీ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేయడం తప్ప చేసింది ఏమీ లేదని గతంలో అభివృద్ధి అంటే కూకట్పల్లి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉండేదని.. ఎక్కడికక్కడ రోడ్లు, డ్రైనేజ్ మంచినీరు, పార్కులు ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని.. అలాగే కుకట్పల్లి నియోజకవర్గంలోని సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు అభివృద్ధి కొరకు 69 కోట్లు నిధులు మంజూరు చేసి మూడు సంవత్సరాల అయిందని దీన్ని అభివృద్ధి చేయమని గతంలో సంవత్సరం క్రితం చెప్పామని, కానీ అధికారులు పట్టించుకోవడం లేదని అలాగే భరత్ నగర్ వరకు 31 కోట్ల రూపాయలతో నాలాభివృద్ధి పనులు కూడా అటకెక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నిరుపేదలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కొరకు మళ్ళీ అప్లికేషన్ పెట్టుకోవాలని గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు 31 వేలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్క నిరుపేదకు డబుల్ బెడ్ రూమ్ అందేలా తాను చర్యలు తీసుకుంటానని, అలాగే ఎస్ .ఐ. ఆర్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటును కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.ఓటు హక్కు ప్రతి పౌరుని హక్కు అని, ఏమాత్రం జాగ్రత్తాగా చూసుకోపోయినా ఓటు పోయే అవకాశం ఉందని తెలిపారు.దీనికి సంబంధించి క్షుణ్ణంగా ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ గౌసుద్దీన్ డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, తిరుపతి. బాబా, జావీద్, నూర్, ఖాదిర్ అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ ముఠా దౌర్జన్యం.. పోలీసుల నిర్వేదం?

- బాధితుడే దొంగను పట్టుకొచ్చినా చలించని ఖాకీలు!

పాల్వంచ జూన్ 13 (జన సంఘర్షణ)

'శాంతిభద్రతల పరిరక్షణే మా ధ్యేయం.. ఫ్రెండ్లీ పోలీసింగ్ మా విధానం' అని గొప్పలు చెప్పుకునే తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందా? సైబర్ నేరగాళ్ల బారిన పడి, చివరకు ప్రాణాలకు తెగించి దొంగలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినా.. బాధితుడికి న్యాయం చేయాల్సింది పోయి నిందితులకే పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరిస్తున్నారా? అంటే అవుననే అంటున్నాడు పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజాపురం గ్రామానికి చెందిన బాధితుడు, ఫిర్యాదుదారుడు బుడగం సత్యనారాయణ. ఫోన్ పే మోసాలు, సైబర్ క్రైమ్ బెదిరింపుల వెనుక ఉన్న ఒక పెద్ద ముఠా గుట్టును ఆధారాలతో సహా రట్టు చేసినా, పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితం కావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.





**అసలేం జరిగింది? ఫోన్ పే ముఠా ఆగడాలు ఏమిటి?**

బాధితుడు సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని నివాసి అయిన సట్టు రామలింగయ్య అండ్ ముఠా ఫోన్ పే ద్వారా డబ్బులు కొట్టించి, తిరిగి వారే సైబర్ క్రైమ్ కేసు అంటూ వేధింపులకు గురిచేసే కొత్త తరహా మోసాలకు తెరలేపారు. అంతటితో ఆగకుండా బాధితుడి బ్యాంకు ఖాతాను నిలిపివేసి (ఫ్రీజ్ చేయించి) మానసికంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని చేకూర్చారు. ఈ సైబర్ ముఠా చేస్తున్న అక్రమాలు, బెదిరింపులపై విసిగిపోయిన సత్యనారాయణ, గత జూన్ 7వ తేదీ ఉదయమే పాల్వంచ గ్రామీణ (కిన్నెరసాని) పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరినా అధికారులు స్పందించకపోవడంతో, బాధితుడే స్వయంగా నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించాల్సి వచ్చింది.

**నిందితుడిని అప్పగించినా ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు?**

ఆధారాలతో సహా దొంగను పట్టుకొచ్చి పాల్వంచ రూరల్ ఎస్ఐకి అప్పగించినా, పోలీసులు సరైన విధంగా విచారణ జరపకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటి? బాధితుల హక్కులను కాపాడాల్సిన రక్షకులే, నిందితులకు కొమ్ముకాస్తూ కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసం? చట్టాన్ని గౌరవించి స్టేషన్‌కు వస్తే, కనీసం ఎఫ్ఐఆర్ కూడా బుక్ చేయకుండా అధికారిక దర్యాప్తును ఎందుకు నానబెడుతున్నారు? నేరాన్ని వ్యవస్థలోని సేవా లోపాలను వెలుగులోకి రానీయకుండా అడ్డుపడుతున్న కొందరు అధికారులు.. అనైతికంగా, అక్రమంగా దుర్నీతితో అమ్ముడుపోతున్నారా? అనే బలమైన అనుమానాలను బాధితుడు లేవనెత్తుతున్నారు. ఇలాంటి విధానాలకు తగిన శిక్ష పడనంత కాలం సామాన్యుడికి న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నిస్తున్నారు.

**బాధితుడితో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ దురుసు ప్రవర్తన ఎందుకు?**

ఈ వ్యవహారంలో మరింత విస్మయకరమైన విషయం ఏమిటంటే, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన కొత్తగూడెం సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బాధితుడి పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తించడం. న్యాయం కోసం ఆశ్రయించిన బాధితుడితో.. "మీకు సలహాలు ఇవ్వడం కోసం మేము ఇక్కడ లేము.. ఏం చెప్పుకుంటావో పోయి పోలీస్ వారికే చెప్పుకో" అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన ఆడియో రికార్డింగ్ ఇప్పుడు బయటకు రావడం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. రక్షణ కల్పించాల్సిన ఉన్నతాధికారే ఇంత అహంకారంతో మాట్లాడితే, ఇక సైబర్ నేరగాళ్ల బారిన పడ్డ సామాన్య ప్రజలు తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలి?

**అన్యాయంపై తిరగబడుతున్న బాధితులు.. ఉన్నతాధికారులు స్పందిస్తారా?**

సత్యనారాయణ ఉదంతం, మరియు సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ దురుసు ప్రవర్తనకు సంబంధించిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో బయటకు రావడంతో ఇల్లందు, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో కలకలం రేగింది. ఈ మోసాల వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందనే విషయం గ్రహించిన మరికొంతమంది సైబర్ బాధితులు ఇప్పుడు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎందరో అమాయకుల జీవితాలను నాశనం చేస్తున్న సట్టు రామలింగయ్య ముఠా వెనుక ఉన్న సూత్రధారులను ఎప్పుడు అదుపులోకి తీసుకుంటారు? వ్యవస్థలోని లోపాలను కప్పిపుచ్చుకుంటూ బాధితులను వేధిస్తున్న అధికారులపై చర్యలు ఉంటాయా?

**కలెక్టర్, ఎస్పీ లు స్పందించి న్యాయం చేయాలి:**


సైబర్ క్రైమ్ ముఠాల దౌర్జన్యాలు ఒకవైపు, క్షేత్రస్థాయి పోలీసుల ఉదాసీనత మరోవైపు ఇల్లందు, పాల్వంచ ప్రాంత ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలి. పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అధికారికంగా నిష్పక్షపాత దర్యాప్తు జరిపించాలని బాధితుడు, స్థానిక ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. (బాధితుడు బుడగం సత్యనారాయణ, సెల్ నెంబర్: 9010081368).

# ఆడబిడ్డపై దారుణం జరిగినా మంత్రుల మౌనం సిగ్గుచేటు

- బుడుగం నాగేశ్వరరావు
- ఆడబిడ్డపై దారుణం జరిగినా మంత్రుల మౌనం సిగ్గుచేటు: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్
- బీఆర్ఎస్ నేత రేప్ చేస్తే ఆ పార్టీ ఎందుకు స్పందించడం లేదు?
- రాపర్తి ఘటనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ల ద్వంద్వ వైఖరిని వీడాలి
- చిన్నారిపై అఘాయిత్యం.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలి: ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్

కొత్తగూడెం జూన్ 13 (జన సంఘర్షణ)

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని రాపర్తి నగర్‌లో 12 సంవత్సరాల అమాయక ఆడబిడ్డపై జరిగిన అమానవీయ హత్యాచార ఘటనపై అటు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల వైఖరి అత్యంత దారుణంగా ఉందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ భద్రాద్రి జిల్లా కన్వీనర్, ప్రముఖ ఉద్యమ నేత బుడుగం నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక గిరిజన ఆడబిడ్డ జీవితం ఇలా అర్థాంతరంగా ఆగం అయిపోతే, జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు కనీసం నోరు మెదపకపోవడం వారి చేతగానితనానికి నిదర్శనమన్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని తక్షణమే ఎన్‌కౌంటర్ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




ఖమ్మం జిల్లాలో పేరుకు ముగ్గురు కీలకమైన మంత్రులు ఉన్నప్పటికీ, ఇంత పెద్ద దారుణం జరిగితే ఒక్కరికి కూడా నోటి మాట రాకపోవడం సిగ్గుచేటని నాగేశ్వరరావు విమర్శించారు. "ఒకవేళ ఇదే స్థానంలో మీ ఇంట్లో బిడ్డకు ఇలాంటి అన్యాయం జరిగితే మీరు ఇలాగే మౌనంగా ఉంటారా?" అని ఆయన మంత్రులను సూటిగా ప్రశ్నించారు. చేతకాని రాజకీయాలు పక్కన పెట్టి, బాధితురాలి కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఈ సమాజం మిమ్మల్ని ఎప్పటికీ క్షమించదని హెచ్చరించారు. ఆడబిడ్డల రక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీనతను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇదే క్రమంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ ద్వంద్వ వైఖరిని కూడా బుడుగం నాగేశ్వరరావు తీవ్రంగా ఎండగట్టారు. ఈ ఘోరానికి ఒడిగట్టిన సదరు లుచ్ఛాగాడు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య మెంబర్ అయినందు వల్లేనా ఆ పార్టీ అగ్రనాయకత్వం ఇప్పటివరకు దీనిపై స్పందించకుండా నోరు మూసుకుందని ప్రశ్నించారు.

గతంలో బండి భగీరథ విషయంలో కేవలం ఆరోపణలు వస్తేనే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ప్రెస్ మీట్లు పెట్టి నానా హంగామా చేసిన బీఆర్ఎస్ నాయకులు.. ఇప్పుడు తమ పార్టీకి చెందిన వ్యక్తి ఒక చిన్నారిపై ఇంతటి దారుణానికి ఒడిగడితే ఎందుకు దాక్కున్నారని నిలదీశారు. రాజకీయ ప్రయోజనాల కోసం శవ రాజకీయాలు చేసే సంస్కృతిని వీడాలని, తప్పు చేసిన వాడు ఏ పార్టీకి చెందినవాడైనా కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ ఒకరి తప్పులను మరొకరు కప్పిపుచ్చుకుంటూ కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ దారుణమైన కేసులో నిందితుడికి వెనుక ఉండి ఎవరైనా రాజకీయ రక్షణ కల్పించాలని చూస్తే ప్రజాసంఘాలు, సామాజిక శక్తుల ఆధ్వర్యంలో వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిద్రమత్తు వీడి, ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి విచారణ వేగవంతం చేయాలని బుడుగం నాగేశ్వరరావు కోరారు. సమాజంలో మృగాళ్లకు వణుకు పుట్టేలా ఆ రేపిస్టుకు చట్టపరంగా అత్యంత కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడంతో పాటు అన్ని విధాలా అండగా నిలవాలని, లేనిపక్షంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 7 మంది బంగ్లాదేశ్ జాతీయులు అరెస్ట్

జీడిమెట్ల/జూన్ 13/(జన సంఘర్షణ)




విశ్వసనీయ సమాచారం, నమ్మదగిన నిఘా వర్గాల సమాచారం ఆధారంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది గజులరామారం-జీడిమెట్ల ప్రాంతంలోని హెచ్ఏఎల్ ఏరియాలో ఉన్న ఒక అద్దె ఇంట్లో కొంతమంది బంగ్లాదేశ్ జాతీయులు అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. ఈ సమాచారంపై చర్య తీసుకుంటూ, జీడిమెట్ల పీఎస్ ఎస్‌హెచ్ఓ తన బృందంతో కలిసి ఆ ప్రదేశంలో సోదాలు నిర్వహించి ఏడుగురు (07) బంగ్లాదేశ్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, అదుపులోకి తీసుకున్న వ్యక్తులలో ఎవరి వద్దా భారతదేశంలో ఉండేందుకు అనుమతించే చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర ప్రయాణ పత్రాలు లేవని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వారు భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, వారిపై తగిన నిర్బంధ మరియు కదలికల నియంత్రణ ఉత్తర్వులను పొందారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ సెంటర్‌కు తరలిస్తున్నారు. నిర్దేశించిన చట్టపరమైన విధానం ప్రకారం వారి బహిష్కరణ ప్రక్రియను ప్రారంభించారు. సంబంధిత అధికారులచే అవసరమైన లాంఛనాలు, ధృవీకరణ పూర్తయిన తర్వాత, వారిని బంగ్లాదేశ్‌కు బహిష్కరించి, వారి స్వస్థలాలకు తిరిగి పంపిస్తారు.

# కుక్కకు జీపీఎస్ ట్రాకర్ పెట్టినా.. దొరకని జాను ఆచూకీ

కాకినాడ జిల్లా/జూన్13/(జన సంఘర్షణ)

కాకినాడ జిల్లా, తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి (జాను) ఆచూకీ దొరకడం లేదు. పాప కనిపించకుండా పోయి వారం అవుతున్నా.. ఆమె జాడ తెలియకపోవడంతో తల్లిదండ్రులు అల్లాడుతున్నారు. కాకినాడ జిల్లా తుని మండలం, దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలో యాభై ఎకరాల పామాయిల్ తోట ఉంది. ఈ తోటలో గణేష్, భవాని దంపతులు కాపలాదారులుగా పనిచేస్తున్నారు. కుమార్తె జానుతో కలిసి అక్కడే ఉంటున్నారు. అయితే గత శనివారం పెంపుడు కుక్కతో కలిసి రెండేళ్ల జాను ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఆచుకీ దొరకడం లేదు.

**అధికారులు గాలింపు...**

కూతురు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు తోటలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పామాయిల్ తోట పక్కనే అడవి ఉండటంతో పోలీసులు, ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు పాప కోసం వారం రోజులుగా గాలిస్తున్నారు. అయినా ఆచూకీ లభించలేదు. అయితే పాపతో వెళ్లిన కుక్క ఇటీవల తిరిగి వచ్చింది.

**జీపీఎస్ ట్రాకర్ అమర్చి..**

పాప ఎక్కడుందో కుక్కకు తెలిసి ఉంటుందని పోలీసులు భావించారు. అయితే కుక్కను వదిలితే అది ప్రజలను చూసి భయపడింది. దీంతో దానికి జీపీఎస్ ట్రాకర్ అమర్చి వదిలి పెట్టారు. ఆ కుక్క తిరిగి వచ్చింది. అది తిరిగిన మార్గంలో గాలించినా.. జాను జాడ మాత్రం లభించలేదు. 25 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 10 మంది ప్రత్యేక బృందం సభ్యులు, ఏడుగురు సీఐలు,



పలువురు ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు ఇలా మొత్తం సుమారు 100 మంది జ్ఞానేశ్వరి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. డ్రోన్‌లతో సైతం అడవిని జల్లెడ పడుతున్నారు. తమ కూతురు ఎలా ఉందోనని తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. అయితే పాపను ఎవరైనా కిడ్నాప్ చేశారేమోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# బీర్కూర్‌లో దొంగల హల్‌చల్.. తాళం వేసిన ఇంట్లో చోరీ..

బాన్సువాడ ప్రతినిధి/జూన్ 13/(జన సంఘర్షణ)

తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన బీర్కూర్ మండల ,కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బీర్కూర్ మండల కేంద్రంలో.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్‌కు చెందిన వడ్ల రాజు కొత్త ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో ప్రస్తుతం కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అయితే తన పాత ఇంటికి తాళం వేసి ఉంచాడు. గురువారం రాత్రి ఆలస్యంగా ఇంటి వద్దకు వెళ్లిన రాజు ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టబడి ఉండడాన్ని గమనించాడు. అనుమానం రావడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా ఇంట్లోని సామన్లు చిందరవందరగా పడి ఉండడంతో పాటు బీరువా తెరిచి ఉండడం కనిపించింది. బీరువాలో భద్రపర్చిన సుమారు 3 తులాల బంగారు ఆభరణాలు, 13 తులాల వెండి ఆభరణాలు, రూ. 1.20 లక్షల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు





గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సంఘటనా స్థలం వద్ద ఆధారాలను సేకరించి పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిసిన దిశా

◆ **కమిటీ సభ్యుడు, పొట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య**


భద్రాద్రి కొత్తగూడెంజిల్లా, పినపాక, జూన్ 13(జనసంఘర్షణ):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశా కమిటీ సభ్యుడిగా ఎంపికైన పినపాక మండలం పొట్లపల్లి గ్రామ సర్పంచ్ మద్దెల సమ్మయ్య మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దిశా కమిటీ సభ్యుడిగా ఎంపికైన మద్దెల సమ్మయ్యకు అభినందనలు తెలియజేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షించడంలో దిశా కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి మరింత కృషి చేయాలని మద్దెల సమ్మయ్యకు సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీకి అధిష్టానం షోకాజ్ నోటీసులు

కామారెడ్డి బ్యూరో./జూన్ 13/(జన సంఘర్షణ)



కామారెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి ప్రస్తుత ప్రధాన సలహాదారులు షబ్బీర్ అలీపై మాజీ చైర్పర్సన్ హిందూ ప్రియ జిల్లా ఎస్పీకి శు క్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతోపాటు కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతో. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలికి అధిష్టానం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో డబ్బులు ఇచ్చి, పండబెట్టి పదవులు తీసుకుంటున్నారని వ్యాఖ్యలు చేసిన షబ్బీర్ అలీ. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డబ్బులు తీసుకొని పదవులు అమ్ముకుంటున్నాడని ఆరోపణలు. దీంతో షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు పంపిన క్రమశిక్షణ కమిటీ.

# హైదరాబాద్‌లో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్ భగ్నం..

◆ **ముగ్గురు అరెస్ట్**

హైదరాబాద్ /జూన్ 13/(జన సంఘర్షణ)



హైదరాబాద్ నగరంలోని ఎల్బీనగర్ పరిధిలో అక్రమంగా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న రాకెట్‌ను పోలీసులు భగ్నం చేశారు. వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నిర్వహించిన డికాయ్ ఆపరేషన్ ద్వారా ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. వనస్థలిపురంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణులకు చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఓ మహిళా పోలీసు సిబ్బందిని గర్భిణిగా నటిస్తూ ఆస్పత్రికి పంపారు. అక్కడి సిబ్బంది గర్భంలోని శిశువు లింగాన్ని తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో పోలీసులు కీలక ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో భాగంగా ఆస్పత్రి డైరెక్టర్ కొర్ర రాజుతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది గర్భిణులను తుక్కుగూడలోని ఓ క్లినిక్‌కు పంపిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం అక్కడ నిర్వహించిన తనిఖీల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను పట్టుకున్నారు. అలాగే రిసెప్షనిస్ట్ లోకేశ్‌ను కూడా అరెస్ట్ చేశారు. నిందితులపై ప్రీ-కన్సెప్షన్ అండ్ ప్రీ-నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ , చట్టం కింద కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. గర్భంలోని శిశువు లింగాన్ని వెల్లడించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాలికల జనన నిష్పత్తిని దెబ్బతీసే ఇటువంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపైనా, వాటిని ప్రోత్సహించే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు సేకరిస్తున్న వనస్థలిపురం పోలీసులు, ఈ అక్రమ రాకెట్‌కు మరెవరైనా సంబంధం ఉన్నారా అనే కోణంలో విచారణ చేపట్టారు

# విమానం టాయిలెట్‌లో రూ.4.26 కోట్ల బంగారం స్వాధీనం

అహ్మదాబాద్/జూన్ 13/(జన సంఘర్షణ)



అహ్మదాబాద్: గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీ బంగారం స్మగ్లింగ్ యత్నాన్ని భగ్నం చేశారు. దుబాయ్ నుంచి వచ్చిన ఇండిగో విమానంలో అత్యంత చాకచక్యంగా దాచిపెట్టిన రూ. 4.26 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. జూన్ 12న దుబాయ్ నుంచి అహ్మదాబాద్‌కు చేరుకున్న విమానంలో అక్రమంగా బంగారం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం కస్టమ్స్ అధికారులకు అందింది. దీంతో అధికారులు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీర్ల సహకారంతో విమానం ముందు భాగంలోని టాయిలెట్‌లోని అనౌన్స్‌మెంట్ స్పీకర్ బాక్స్‌ను పరిశీలించగా, దాని వెనుక భాగంలో నల్లటి ప్లాస్టిక్ టేపుతో చుట్టిన రెండు అనుమానాస్పద పౌచ్‌లు కనిపించాయి. పౌచ్‌లను తెరిచి చూడగా అందులో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 24 విదేశీ బంగారు బిస్కెట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి మొత్తం బరువు 2,799.3 గ్రాములు (సుమారు 2.8 కిలోలు) కాగా, అంతర్జాతీయ మార్కెట్ విలువ రూ. 4,26,89,325గా అధికారులు అంచనా వేశారు.

# కారుపై పడ్డ కొమ్మలు తొలగిస్తుండగా విద్యుత్ షాక్..

◆ **తండ్రి, కూతురు మృతి.. తల్లి పరిస్థితి విషమం**

హైదరాబాద్/జూన్ 13/(జన సంఘర్షణ)



అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెలికాం కాలనీలో శనివారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. కారుపై పడిన చెట్టు కొమ్మలను తొలగించే క్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో తండ్రి, కూతురు మృతి చెందగా, వారిని రక్షించేందుకు ప్రయత్నించిన తల్లి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఇంటి ముందు పార్క్ చేసిన కారుపై చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. శనివారం ఉదయం వాటిని తొలగించే ప్రయత్నంలో సందీప్ (44), ఆయన కుమార్తె రితిక (16) కారుపై ఉన్న కొమ్మలను తొలగిస్తుండగా, సమీపంలోని విద్యుత్ తీగలు ఆ కొమ్మలకు తగిలి ఉండటంతో ఒక్కసారిగా కరెంట్ ప్రవహించింది. ఈఘటనలో రితిక విద్యుత్ షాక్‌కు గురికాగా, ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తండ్రి సందీప్‌కు కూడా విద్యుత్ షాక్ తగిలింది. తీవ్ర విద్యుత్ ప్రభావంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అదే సమయంలో సహాయం చేసేందుకు వెళ్లిన సందీప్ భార్య శ్వేత (40)కు కూడా విద్యుత్ షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆమెను సమీప ఆసుపత్రికి తరలించగా, ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈవిషాద ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ తీగలు, చెట్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ తీగలకు సమీపంలో ఉన్న చెట్టు కొమ్మలను స్వయంగా తొలగించే ప్రయత్నం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రూ.11.82 కోట్ల విలువైన డ్రగ్స్‌తో మోడల్ అరెస్ట్

ముంబై/జూన్ 13/(జన సంఘర్షణ)




ముంబై, భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను అక్రమంగా తరలిస్తున్న ఓ మోడల్‌ను కస్టమ్స్ అధికారులు ముంబై విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. పట్టుబడిన మహిళ హర్షా సన్నీగా గుర్తించారు. ఆమె ఇటీవల నిర్వహించిన మిస్ కేరళ-2025 పోటీల్లో రన్నరప్‌గా నిలిచినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం.. హర్షా సన్నీ బ్యాంకాక్ నుంచి ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. ఆమె ప్రవర్తన, కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వద్ద ఉన్న ట్రాలీ బ్యాగును పరిశీలించగా, వ్యాక్యూమ్ సీల్ చేసిన ప్యాకెట్లలో సుమారు 11 కిలోల మాదకద్రవ్యాలు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ. 11.82 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం హర్షా సన్నీని అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రాథమిక విచారణ అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న అంతర్జాతీయ ముఠా, ఇతర నిందితుల ప్రమేయంపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన మోడలింగ్ రంగంలోనే కాకుండా దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కస్టమ్స్, నార్కోటిక్స్ విభాగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

# కామారెడ్డిలో 10 మంది కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు

కామారెడ్డి బ్యూరో/జూన్ 13/(జన సంఘర్షణ)



కామారెడ్డిలో 10 మంది కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదైంది. మాజీ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఈ చర్య తీసుకున్నారు. సోషల్ మీడియాలో తనపై అసభ్యకరంగా ట్రోల్ చేశారని ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు మేరకు బి. ఎన్.ఎస్ ఐటీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్ /జూన్ 13/ (జనసంఘర్షణ)




హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌పరిధిలోని హైఅలర్ట్ ఉండాలని ఉన్నతాధికారులకు ఆదేశించిన సీఎం. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించిన సీఎం. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, సీయూఆర్‌ఈ స్పెషల్ సీఎస్ సహా సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షించి చర్యలు చేపట్టాలన్న సీఎం. నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించిన ముఖ్యమంత్రి. రెయిన్ ఫోర్ కాస్టింగ్ ఆధారంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని సూచించిన సీఎం.

# విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత

- కళాశాల యజమాన్యాలను ఆదేశించిన కలెక్టర్.
  నర్సింగ్ కాలేజ్ ను సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి.

నిజామాబాద్, /జూన్ 13/(జన సంఘర్షణ)

విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కళాశాల యజమాన్యాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. కాలేజీ ఆవరణను పరిశీలించిన సందర్భంగా ప్రహరీ లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ కాలేజీ వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలని అన్నారు. తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో భేటీ అయ్యారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సేవా భావంతో కూడిన నర్సింగ్ కోర్సు వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో విరివిగా ఉపాధికి లభించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా వంటికి ఒకింత దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్తు కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి కలలను నిజం చేయాలని, అధ్యాపకులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. కాగా, వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యార్థినులకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏవైనా అనుకోని



ఘటనలు జరిగితే సఖీ వన్ స్టాప్ సెంటర్ ను సంప్రదిస్తే, వారు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ న్యాయం జరిగేలా కృషి చేస్తారని, మీ వ్యక్తిగత గుర్తింపు బయటపడకుండా గోప్యత పాటిస్తారని కలెక్టర్ తెలిపారు. బాలికల రక్షణకు, వారి ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించకూడదని, బంధువులు అయినా సరే లోనికి రాకుండా చూడాలని నిర్వాహకులను, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శేఖర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

# అన్న అండ.... అక్రమ మొరం దందా

- సెలవు దినంలో కూడా మట్టి, మొరం త్రవ్వకాలు
- ఇది దేశాయిపేట్‌కు చెందిన చోటా లీడర్ అక్రమ త్రవ్వకాలు
- ఎవరికి అనుమతి ఇవ్వలేదు... తాసిల్దార్ సవాయి సింగ్

బీర్కూర్ /జూన్ 13/(జన సంఘర్షణ)

అన్న అండలు ఉన్నంతవరకు మొరం మాఫియా, ఇసుక మాఫియా, మట్టి మాఫియా కు ఎవరు అడ్డుకునేదే లేదు. ఎవరైనా అడ్డుకుంటే వెంటనే అన్నకు ఫోన్, అన్న నుంచి ఫోన్ రావడంతో అధికారులు ఎక్కడికక్కడ గప్చుప్ . ఇది బాన్సువాడ నియోజకవర్గంలో గత నెల రోజుల నుంచి చెరువుల్లో, కొండల్లో, నదుల్లో కొనసాగుతున్న మాఫియా దందాలు. సెలవు రోజులు వచ్చాయంటే మాఫియాకు పంట పండినట్టే. అధికారులందరూ సెలవులో... మాఫియా కొండల్లో, చెరువుల్లో, నదుల్లో ఇది బాన్సువాడ నియోజకవర్గంలో కొన్ని సాగుతున్న దందాలు. సులువుగా లక్షల రూపాయలు సంపాదించుకోవడానికి బాన్స్వాడ మండలం దేశాయిపేట్ కు చెందిన ఓచోట లీడర్ సెలవు దినంలో కూడా చించొల్లి శివారులో భారీ యంత్రాలు పెట్టి టిప్పర్ల ద్వారా మొరం త్రవ్వకాలు జరుపుతూ అక్రమంగా మొరం తరలిస్తున్న సంబంధిత శాఖ అధికారులు మౌనం పాటిస్తున్నారు. ఏమైనా అంటే సెలవు దినాలు ఉన్నాయి తమ విధుల్లో లేము ఎవరికి కూడా మట్టి, మొరం త్రవ్వకాలు అనుమతులు ఇవ్వలేదు అంటూ బీర్కూర్ తాసిల్దార్ సవాయిసింగ్ వివరణ ఇస్తున్నప్పటికీ, చించొల్లి శివారులో దేశాయిపేటకు చెందిన చోట లీడర్ తన అన్న బలంతో సెలవు దినంలో కూడా దర్జాగా పట్టపగలే మొరం తరలిస్తున్నారు. కనీసం పోలీస్ శాఖ కూడా అక్రమంగా సెలవు దినంలో పెద్దపెద్ద టిప్పర్లలో ఇసుక తరలించుకుంట పోతుంటే వారు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యుడు తన ఇంటి కోసం ఒక ట్రక్టర్ ఇసుక ప్రభుత్వ అనుమతులు లేకుండా తీసుకొని వస్తే ఆ ట్రాక్టర్ ను పోలీస్స్టేషన్లో పెట్టి మూడు నెలలు తిప్పి కేసులు పెట్టి న్యాయస్థానాలు చుట్టూ తిప్పుతున్న పోలీస్ శాఖకు తమ కళ్ళముందే ఇసుక త్రవ్వకాలు జరుగుతుంటే ఎందుకు అడ్డుకోవడం లేదంటూ గ్రామాల ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దేశాయిపేటకు చెందిన లీడర్ బాన్సువాడ నియోజకవర్గంలో ఒకవైపు ఇసుక, మరొకవైపు మొరం, ఇంకొక వైపు మట్టి అక్రమంగా తరలించుకుంటూ పోయి లక్షలు గడిస్తున్నారు. ఈ మాఫియా లీడర్ కు అన్నతో పాటు అధికారులు కూడా సహకరించడంతో ఆయన రాజ్యం కొనసాగుతుంది. కళ్ళ ముందే ప్రకృతి కొల్లగొడుతుంటే సంబంధిత శాఖ అధికారులు నెల నెల మామూలు అందుకుంటూ మాఫియాకు అండగా నిలుస్తున్నారు కొంతమంది అధికారులు. బాన్స్వాడ నియోజకవర్గంలో



పలు మండలాల్లో జరుగుతున్న మొరం, ఇసుక, మట్టి అక్రమంగా తరలింపులో పెద్ద ఎత్తున కొంతమంది అధికారులకు ముడుపులు అందిస్తున్నాయి. ఒక్కొక్క అధికారికి నెలకు లక్ష నుంచి రెండు లక్షల పైగా అధికారులకు అక్రమ సంపాదన జేబులో చేరుతుంది. ప్రకృతి ఏమైతే ఏంది? తాము ఇక్కడ శాశ్వతంగా ఉద్యోగాలు చేస్తామా? ఇక్కడ లేకుంటే మరొక చోట అన్న ధీమా తో ఉన్నారు. అధికారం ఉన్నప్పుడే అక్రమంగా ఆస్తులు కూడా పెట్టుకున్నారు. శనివారం బీర్కూర్, చించోల్లి, రుద్రూర్, అస్గుల్ తో పాటు మరికొన్ని మండలాల్లో మాఫియా చెలరేగిపోతున్నారు. అన్న నిబంధన ఉన్నప్పటికీ, ప్రభుత్వ అనుమతులు లేకుండా సెలవు దినాల్లో బాన్స్వాడ నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఒకవైపు మొరం, మరొకవైపు ఇసుక, ఇంకొక వైపు మట్టి త్రవ్వకాలు జోరుగా సాగాయి. సంబంధిత శాఖ అధికారులు కళ్ళు మూసుకున్నారు.

# విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్/జూన్ 13/(జన సంఘర్షణ)

విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని.. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**విద్యాసంస్థల్లో స్వచ్ఛమైన తాగునీరు...**

ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ, వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చూడాలన్నారు. బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే, ఈ నెల 20వ తేదీ లోపు వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్





తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విద్యాసంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్సూచించారు.

ఆయా ప్రభుత్వ విద్యా సంస్థలలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, నిర్వహణాపరమైన లోపాలు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఎస్సీడీవో రజిత, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఆర్సీవో, సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## 9 మందికి జైలు, 55 మందికి జరిమానా:ఇన్ ఛార్జ్ సీపీ..

నిజామాబాద్/జూన్ 13/(జన సంఘర్షణ)



నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత వారం రోజుల్లో డ్రంకెన్ డ్రైవ్లో పట్టుబడిన 9 మందికి జైలు శిక్ష, అలాగే మరో 55 మందికి రూ.5.50 లక్షల జరిమానా విధించినట్లు ఇన్చార్జ్‌సీపీ రాజేశ్ చంద్ర తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రంకెన్ డ్రైవ్లో దొరికిన వారి డ్రైవింగ్ లైసెన్స్ ఆరు నెలలు సస్పెండ్ చేస్తారని రాజేష్ చంద్ర పేర్కొన్నారు.

## మహిళా ఐఏఎస్, ఐపీఎస్ గొడవ.. సుప్రీం కీలక ఆదేశం


కర్ణాటక/జూన్ 13/(జన సంఘర్షణ)



కర్ణాటక మహిళా ఐపీఎస్ రూపా మౌద్గిల్, ఐఏఎస్ రోహిణీ సింధూరి తమ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా తేల్చుకోవాలని ఎస్సీ ఆదేశించింది. ఇందుకు మాజీ జడ్జి జస్టిస్ కురియన్ జోసెఫ్ను మీడియేటర్ నియమించింది. కాగా సీనియర్ ఐఏఎస్‌లకు రోహిణి తన ప్రైవేట్ ఫొటోలు పంపి, అవినీతికి పాల్పడ్డారంటూ 2023లో రూపా ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టడం ఈ వివాదానికి కారణమైంది. దీంతో రూపా క్షమాపణ చెప్పి, రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని రోహిణీ కేసు వేశారు.

## సిమ్స్ విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో అధికారుల తనిఖీలు..

గోదావరిఖని//జూన్ 13 /(జన సంఘర్షణ)




గోదావరిఖనిలోని డెస్టినేషన్ ప్రముఖ రెస్టారెంట్లో ఆహారం తిన్న అనంతరం సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సిమ్స్ విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన కలకలం రేపింది. పట్టణంలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో చికెన్ మండి తిన్న కొంతమంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి అనారోగ్య లక్షణాలు కనిపించడంతో శనివారం ఉదయం వారిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించారు. మెడికల్ కాలేజ్ హాస్టల్ను సందర్శించి అస్వస్థతకు గురైన విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించడంతో పాటు చికిత్స అందించిన వైద్యులతో కూడా చర్చించారు. విద్యార్థులు ఆహారం తీసుకున్న డెస్టినేషన్ రెస్టారెంట్పై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రెస్టారెంట్ నిర్వహణలో అనేక లోపాలు బయట పడ్డాయని అధికారులు వెల్లడించారు. రెస్టారెంట్ వంటగది ప్రాంతంలో ఈగలు అధికంగా సంచరిస్తున్నట్లు గుర్తించారు. అంతే కాకుండా వంటగది లోపల, బయట సుమారు ఐదు నుంచి ఆరు ఎలుకలు స్వేచ్ఛగా తిరుగుతున్న పరిస్థితి కనిపించినట్లు తెలిపారు. వంటకు వినియోగిస్తున్న నూనె నాణ్యతను టీపీసీ మీటర్ ద్వారా పరీక్షించగా అనుమతించిన పరిమితికి మించి ఉన్నట్లు అధికాగులు గుర్తించారు. సాధారణంగా అనుమతించబడిన 25 శాతం పరిమితిని మించి నూనె వినియోగిస్తున్నట్లు తేలింది. అలాగే వంటగదిలో నిల్వ ఉంచిన మయోనైజ్ను పరిశీలించగా, అది ముడి గుడ్లతో తయారు చేసినదిగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. భోజనశాల అంతటా దుర్వాసన వ్యాపించి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. మొత్తంగా పరిశీలించగా డెస్టినేషన్ రెస్టారెంట్ అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో కొనసాగుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే విధంగా ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఆహార భద్రత అధికారులు ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. రెస్టారెంట్పై షెడ్యూల్-4 నిబంధనల ఉల్లంఘనలపై తనిఖీలు నిర్వహించి, తదుపరి చర్యల కోసం అడ్జుడికేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెస్టారెంట్ నిర్వహణకు అనర్హంగా ఉన్నట్లు తేలడంతో డెస్టినేషన్ రెస్టారెంట్ను తాత్కాలికంగా మూసివేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే విధంగా వ్యవహరించే హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. సిమ్స్ విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆహార నమూనాల పరీక్షల అనంతరం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అదేవిధంగా నిజాంబాద్ బోధన్ ఉమ్మడి మండలంలో ఇదే పరిస్థితిగా ఉందని ప్రజలు పేర్కొన్నారు.

## బొద్దింక హైదరాబాద్ వస్తోంది నేను వెళుతున్నా..

- ఆదివారం ధర్నచౌక్ 10గం॥లకు హైదరాబాద్‌కు రండి!.....

హైదరాబాద్/జూన్ 13/(జన సంఘర్షణ)




మన దేశ జనాభాలో సగానికి పైగా యువత (14-45 సంవత్సరాల మధ్య) ఉన్నప్పటికీ, నేడు వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోంది. మనకంటే తరువాత స్వాతంత్ర్యం పొందిన చైనా, ఇజ్రాయిల్ వంటి దేశాలు తమ మానవ వనరులను సమర్థంగా ఉపయోగించుకొని శాస్త్ర, సాంకేతిక, విద్యా రంగాల్లో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. అయితే భారతదేశంలో మతతత్వ రాజకీయాలు యువత దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లిస్తూ, హిందూ-ముస్లిం-క్రైస్తవ మత వివాదాలు, ఆవు పేడ-ఆవు మూత్రం వంటి చర్చలలో సమాజాన్ని చిక్కుబెడుతున్నాయి. నిరుద్యోగం పరీక్షా పేపర్ల లీకేజీలు విద్యా వ్యవస్థలో లోపాలు అవకాశాలలో అసమానతలు ఇవన్నీ యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితులను ప్రశ్నించడానికి, రాజ్యాంగ విలువలను కాపాడడానికి, సామాజిక న్యాయం కోసం పోరాడడానికి యువత ముందుకు రావాలి! “బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు - సిద్ధాంతాలే ఈ దేశానికి శరణ్యం.” యువత మేల్కొనాలి! సంఘటితం కావాలి! పోరాటానికి సిద్ధం కావాలి! ఇంకెప్పుడు ఇదే సమయం రా కదలిరా..నేను వెళ్తున్నా.. మీరు వస్తారా?..హైదరాబాద్‌లో కలుద్దాం!

## మేడ్చల్-మల్కాజిగిరి సీపీ పి. సుమతిని కలిసిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి..

హైదరాబాద్/జూన్ 13/(జన సంఘర్షణ)



హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ పీ.సుమతి ని వెట ఫౌండర్ ,టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఈ నెలలో ప్రారంభం కానున్న “ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఇండియా” కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను కమిషనర్‌కు అందజేశారు.. మహిళల సాధికారత, భద్రత, విద్య, స్వయం ఉపాధి, నాయకత్వ వికాసం సామాజిక చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో “ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఇండియా” కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఝాన్సీ రాజేందర్ రెడ్డి తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగేందుకు అవసరమైన అవగాహన, ప్రోత్సాహం అవకాశాలను కల్పించే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరై విజయవంతం చేయాలని కమిషనర్ పి. సుమతిని ఆహ్వానించారు. ఈ భేటీలో మహిళా సంక్షేమం, సామాజిక అభివృద్ధి మహిళలకు మరింత భద్రత కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సానుకూలంగా అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. “ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఇండియా” కార్యక్రమం మహిళల అభ్యున్నతికి దోహదపడేలా విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు ఝాన్సీ రాజేందర్ రెడ్డి తెలిపారు.

## ఘన వ్యర్థాల నిర్వహణ పనులను పరిశీలించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీనా బాను



**పలమనేరు,జూన్ 13 ప్రజావారధి:**
పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని కంపోస్ట్ యార్డ్‌లో జరుగుతున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఐ.ఎస్.డబ్ల్యూ.ఎమ్) ప్లాంట్ పనులను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీనా బాను గారు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె కంపోస్ట్ యార్డ్‌ను సందర్శించి, తడి చెత్త నుండి ఎరువును తయారు చేసే ప్రక్రియను (ఆర్గానిక్ కంపోస్టింగ్) నిశితంగా పరిశీలించారు. అనంతరం పొడి చెత్త సేకరించే మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎమ్ఆర్ఎఫ్) షెడ్‌ను తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అలాగే, పట్టణంలో త్వరలో ఏర్పాటు చేయబోయే సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ కొరకు సేకరించిన స్థలాన్ని ఆమె స్వయంగా పరిశీలించి, పనుల ప్రగతిపై ఆరా తీశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, అసిస్టెంట్ ఇంజనీర్ శిరీష, శానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్ మరియు స్థానిక శానిటేషన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం.



**కుప్పం,జూన్ 13 ప్రజావారధి:**
రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తూ ఉందని గుడిపల్లి మండల మాజీ జిల్లా పరిషత్ సభ్యులు, క్లస్టర్ బేటప్ప నాయుడు అన్నారు. శనివారం గుడిపల్లి మండలం ఓ.ఎన్. కొత్తూరు గ్రామపంచాయతీలో పశువుల దాన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు, యూనిట్, బూత్ ఇన్చార్జీలు, మరియు పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రైతుల్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం... రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్



**రామకుప్పం జూన్ 13 ప్రజావారధి:**
రైతాంగాన్ని అన్నవిధాల ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అంటూ రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ పేర్కొన్నారు శనివారం రామకుప్పంలోని పశువైద్య కేంద్రంలో రైతులకు సబ్సిడీపై పశువులకు దాన పంపిణీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు బాగుంటే ప్రజలు బాగుంటారని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు సకాలంలో రైతులకు విత్తనాలు ఎరువులు తోపాటు పశు దాన పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు ముఖ్యంగా పాడి పరిశ్రమ అభివృద్ధి చేసి ప్రతి కుటుంబానికి ఆర్థిక అభివృద్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు గోకులం షెడ్లు నిర్మించి రైతులకు సాయపడినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ పశు శాఖ ఏడి సతీష్ పశు వైద్యాధికారి జయశ్రీ మాజీ సర్పంచ్ పివి సీతాపతి కాడ అడ్వైజరీ కమిటీ మెంబర్ రఘు క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి యూనిట్ ఇంచార్జ్ నాగభూషణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు

# గోసంరక్షణ సమాజ శ్రేయస్సుకు,ధర్మ పరిరక్షణకు పునాది

**-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే**

**-వై.కానాపూర్ నందు ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు**



**కర్నూల్ /ప్రజా వారధి:**
భారతీయ సంస్కృతిలో గో సంరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, ఆర్థిక, వ్యవసాయ, ఆధ్యాత్మిక జీవన విధానాలకు ఆధారంగా భావించబడుతున్న గోసంరక్షణ ద్వారా వ్యవసాయం బలోపేతమవడమేకా కుండా, ప్రకృతి సమతుల్యత పరిరక్షించ బడుతుందని అందువల్ల గోసంరక్షణ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, సమాజ శ్రేయస్సుకు మరియు ధర్మ పరిరక్షణకు పునాదిఅని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గూడూరు మండలం, వై. కానాపూర్ గ్రామంలోని శివాలయంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమా ల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజులు డమాం జగదీశ్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పూజారి మద్దిలేటి,సత్సంగసభ్యులు యు.ఈరన్న, యు. చిన్నరాముడు,చదువులన్న, జయరాములు, రామాం జనేయులుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# సోమదేవరపల్లిలో భారీ అగ్నిప్రమాదం..

**-రైతు వ్యవసాయ గుడిసె దగ్ధం**

**- రూ.2 లక్షల ఆస్తి నష్టం**





**ధర్మసాగర్/ప్రజావారధి:**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదం స్థానిక రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. పొలంలో కోయకాలు తగలబెట్టిన సమయంలో మంటలు అదుపుతప్పి వ్యాపించడంతో రైతు నమిండ్ల వీరస్వామికి చెందిన వ్యవసాయ గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలంలో ఉన్న కోయకాలను తొలగించే క్రమంలో వాటికి నిప్పు పెట్టాడు. అయితే గాలుల ప్రభావంతో మంటలు ఒక్కసారిగా విస్తరించి సమీప ప్రాంతాలకు వ్యాపించాయి. ఈ క్రమంలో పక్కనే ఉన్న నమిండ్ల వీరస్వామికి చెందిన వ్యవసాయ గుడిసెకు మంటలు అంటుకుని క్షణాల్లోనే అగ్నికీలల్లో చిక్కుకుంది.మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వాటిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ మంటలు తీవ్రరూపం దాల్చడంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. గుడిసెలో నిల్వ ఉంచిన వ్యవసాయ పనిముట్లు, స్ప్రేయర్లు, వ్యవసాయ పరికరాలు, ఇతర సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది.ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు నమిండ్ల వీరస్వామి తెలిపారు. ఘటనపై సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్న ఆయన, నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా తగిన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.అగ్నిప్రమాదం విషయం గ్రామంలో చర్చనీయాంశంగా మారగా, రైతులు కోయకాలు, పంట అవశేషాలు తగలబెట్టే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# పలమనేరు బుల్లెట్ ట్రైన్ స్టేషన్ సాధనే లక్ష్యం -- రైల్వే శాఖ సానుకూల స్పందనతో ఉద్యమానికి మరింత ఊపు

**పలమనేరు, జూన్ 13 ప్రజావారధి:**
చెన్నై -- బెంగళూరు ప్రతిపాదిత హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో పలమనేరు వద్ద స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో పలమనేరు పరిరక్షణ సమితి (పిపిఎస్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్జీవో హోమ్ ఎదుట భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

**ఈ సందర్భంగా పిపిఎస్ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ...,**

పలమనేరు బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి ప్రధానమంత్రి కార్యాలయానికి పిపిఎస్ తరఫున సమర్పించిన వినతిపత్రానికి కేంద్ర రైల్వే శాఖ నుంచి సానుకూల స్పందన రావడం శుభపరిణామమని తెలిపారు. పలమనేరు స్టేషన్ ఏర్పాటు అంశాన్ని రైల్వే హెడ్‌క్వార్టర్స్ స్థాయిలో



పరిశీలనకు పంపనున్నట్లు అధికారికంగా లేఖ ద్వారా తెలియజేయడం తమ ఉద్యమానికి దక్కిన మొదటి విజయమని, ఇది ఉద్యమానికి మరింత ఊపునిచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ధర్మవరంలో రాష్ట్ర బీజేపీ ముఖ్య నాయకులు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ని పిపిఎస్ బృందం కలిసి వినతిపత్రం సమర్పించిందని నరసింహులు గుర్తుచేశారు. ఈ డిమాండ్‌పై మంత్రి సానుకూలంగా స్పందించారని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పలమనేరుకు బుల్లెట్ ట్రైన్ స్టేషన్ వచ్చేలా తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంగా పలమనేరుకు ఎంతో వ్యూహాత్మక స్థానం ఉందని పిపిఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఇక్కడి భౌగోళిక ప్రాధాన్యత, పారిశ్రామిక, వాణిజ్య మరియు పర్యాటక అవకాశాల దృష్ట్యా బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను పలమనేరులోనే ఏర్పాటు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. పలమనేరు భవిష్యత్తు మరియు సమగ్ర అభివృద్ధి కోసం బుల్లెట్ ట్రైన్ స్టేషన్ సాధించే వరకు తమ ఉద్యమం ఆగదని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పిపిఎస్ కార్యదర్శి నారాయణ, విజయకుమార్ రెడ్డి, పొన్నుడి, రామచంద్ర, వెంకట్, సేగు రాఘవయ్య, వీరభద్రయ్య, నాగప్ప, విజయకుమార్, రెడ్డెప్ప నాయుడు, పుష్పల వెంకటేశ్వర్లు, లక్ష్మీపతి పలువురు పిపిఎస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony, Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co